క్లుప్తంగా

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి

నారాయణపేట టౌన్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 19వ వార్డు కౌన్సిలర్ సరిత అన్నారు. 19వ వార్డులో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డీఎంహెచ్ఓ రాంమనోహర్‌రావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ మోనేష్ చారి, బీఆర్ఎస్ నాయకులు సతీష్ గౌడ్, సర్ఫరాజ్ అన్సారీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

మక్తల్: దాసర్‌దొడ్డి లో హెచ్‌పీ గ్యాస్ డీలర్ శాంతయ్య ఆధ్వర్యంలో గ్యాస్ నిర్వహణ, వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, బసిలింగమ్మ, ఉప సర్పంచ్ నర్సిములు, రాజు, కృషి ఎంటర్‌ప్రైజెస్ సిబ్బంది పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలిరావాలి

నారాయణపేట టౌన్ : నందమూరి తారకరామారావు శతజయంతి సందర్భంగా బుధవారం మహబూబ్‌నగర్‌లో మినీ మహానాడు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వినయమిత్ర యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, నాయకులు బక్కని నర్సిములు, రావుల చంద్రశేఖర్ రెడ్డిలతోపాటు పలువురు నాయకులు హాజరవుతున్నారని వివరించచారు. నాయకులు, కార్యకర్తలు, ఎన్‌టీఆర్ అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

కోస్గి: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం పాలమూర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మినీ మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి డీకే రాములు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పోస్టర్ విడుదల



కోస్గి/మద్దూరు: బహుజన్ సమాజ్ పార్టీ ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'తెలంగాణ భరోసా సభ' పోస్టర్‌ను మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నర్మద, పార్టీ నాయకులు కోస్గి, మద్దూరు పట్టణాల్లోని అంబేడ్కర్ విగ్రహాల ఎదుట విడుదల చేశారు. నాయకులు పురుషోత్తం, ముకుంద్ పాల్గొన్నారు.

గోమాతకు అంత్యక్రియలు

నారాయణపేట రూరల్ : ఇటీవల విష ఆహారం సేవించిన ఆవు మంగళవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే విషాహారం తిని ఆవు ప్రాణాపాయ స్థితిలో ఉండగా ఆదివారం కొందరు యువకులు పశువైద్యుల సహకారంతో వైద్య సేవలు అందించారు. ఐదు రోజుల పాటు వైద్యసేవలు అందించాల్సి ఉండడంతో ఆవును గుర్తించడం కోసం ట్యాగ్ కూడా వేశారు. కానీ రెండు రోజుల నుంచి వైద్య సేవలు అందకపోవడంతో మంగళవారం మినీ గ్రౌండ్ ఆవరణలో ఆవు పడిపోయి అచేతన స్థితిలోకి వెళ్లి పోయింది. కాగా వైద్యులు అక్కడకు చేరుకుని పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో యువకులు సంప్రదాయ బద్ధంగా ఆవుకు అంత్యక్రియలు చేశారు.

బీఎస్పీలో చేరిక



మక్తల్: గుడిగండ్ల గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ మక్తల్ ఎంఈఓగా పనిచేస్తూ ఇటీవల రాజీనామా చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలియజేశారు.

మండలంగా ప్రకటించాలి

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని మండల సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం 101వ రోజు రోడ్డుపై పెద్దఎత్తున వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ రాము నాయక్, వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ 15గ్రామాల ప్రజలు మద్దతు తెలుపుతూ వంద రోజులుగా రిలేదీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. గద్వాల జిల్లాలో ఎర్రవల్లిని 9గ్రామాలతో కలిపి మండలం చేశారని, చిన్న, చిన్న గ్రామాలను రాష్ట్రంలో ఇటీవల మండలాలుగా ప్రకటించారని తెలిపారు. అతిపెద్ద మండలమైన కోయిల్‌కొండను రెండు మండలాలుగా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయడం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి ఇష్టం లేదా అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ఇదే వైఖరి కొనసాగిస్తే రానున్న రోజుల్లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రోడ్డుపై వంటావార్పు చేయడం ద్వారా రోడ్డుపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు జోక్యం చేసుకొని రోడ్డుపై ఖాళీ చేయించారు. ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పశువైద్యం.. దైవాదీనం!

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- శిథిలావస్థలో పశువైద్య శాలలు
- పట్టించుకోని అధికారులు



చిన్నపొర్లలో పరిస్థితి ఇలా..



బిజ్వార్‌లో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనం

ఊట్కూర్: మండలంలో పశువైద్యశాలల నిర్వహణ తీరు నానాటికి తీసికట్టుగా తయారవుతోంది. పలు చోట్ల ఆస్పత్రి భవనాలు శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని చోట్ల సిబ్బంది కొరత వేధిస్తోంది. కొన్ని చోట్ల దిక్కులేని పరిస్థితిలో పంచాయతీ భవనాల వద్దే వైద్యం అందిస్తున్నారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. పశువులకు చికిత్స చేయించడం కోసం వస్తున్న రైతులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 3 ఆమ్లేట్ గ్రామాలు ఉన్నాయి. ఆ మేరకు ఊట్కూర్, చిన్నపొర్ల, ఎడివేల్లి, బిజ్వార్, పులిమామిడి గ్రామాల్లో పశువైద్యశాలలు ఏర్పాటు చేశారు. కానీ కేవలం డాక్టర్, 4 గురు వీఏలు, ఒక అటెండర్ మాత్రమే ఆయా చోట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్నపొర్ల పశువైద్యశాల వెటర్నరీ అసిస్టెంట్‌తో కొనసాగుతోంది. చిన్నపొర్ల, ఎడివెల్లి, బిజ్వార్ గ్రామాల్లో పశువైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. బిజ్వార్‌లో తప్పని సరి పరిస్థితిలో పంచాయతి భవనంలోని ఓ గదిలో 6 ఏళ్లుగా పశువైద్యశాల నిర్వహణ సాగుతోంది. చిన్నపొర్లలోనూ ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. సమస్యలు వేధిస్తున్న సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి సిబ్బంది కొరత తీర్చాలని.. నూతన భవనాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం

మండలంలోని బిజ్వార్, ఎడివెల్లి, చిన్నపొర్ల పశువైద్య భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. మండలంలో పశువైద్య సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం.

–డాక్టర్ మహాదేవ్, పశువైద్య అధికారి, ఊట్కూర్

నూతన భవనం నిర్మించాలి..



బిజ్వార్‌లో పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. తప్పని సరి పరిస్థితిలో పంచాయతి భవనంలోని ఓ గదిలో 6 ఏళ్లుగా పశువైద్యశాల నిర్వహణ సాగుతోంది. దీంతో వివిధ పనుల నిమిత్తం ఇక్కడకు వచ్చే వారితో పాటు, పశువులకు చికిత్స చేయించడం కోసం వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలి.

–గోవర్ధన్‌రెడ్డి, బిజ్వార్

డాక్టర్‌ను నియమించాలి



పశువుల ఆస్పత్రిలో రెండేళ్లుగా డాక్టర్ లేడు. పశువులకు చికిత్స చేయించడం కోసం మల్లెపల్లి, నాగిరెడ్డిపల్లి, కొల్లూర్, పెద్దపొర్ల తదితర గ్రామాల నుంచి వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వెటర్నరీ అసిస్టెంట్‌తో ఆస్పత్రి కొనసాగుతోంది. అధికారులు స్పందించి వెంటనే డాక్టర్‌ను నియమించాలి.

–యం. రవీందర్‌రెడ్డి, సర్పంచ్, చిన్నపొర్ల

రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా ఇవ్వాలి

నారాయణపేట టౌన్/ నర్వ : ప్రభుత్వాలు రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతిఒక్కరికీ ఉచితంగా పంపిణీ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం అందజేశారు. కన్వీనర్ డేవిడ్ మహారాజ్, కో–కన్వీనర్ ఈశ్వర్, ఆయా మండలాల అధ్యక్షులు శ్రీనివాసులు, గోపాలకృష్ణ, ఓబులేష్ తదితరులుపాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

నారాయణపేట టౌన్ : అకాల వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి రైతును రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్‌యాదవ్ డిమాండ్ చేశారు. హామీలకు పరిమితం కాకుండా పరిహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా రైతులకు ఇబ్బంది కలగకుండా వరి కొనుగోలు చేయాలని బీకెఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా అన్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏపీఎం మృతి

మరికల్/మక్తల్ : ఏపీఎం రామలింగం(45) మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మహిళా సమాఖ్య సభ్యులు తెలిపారు. మరికల్ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న ఆయన కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వారు నివాళి అర్పించారు.

వాహనం బోల్తా

మద్దూరు : బొలేరో వాహనం బోల్తా పడిన ఘటనిది. వివరాలు ఇలా ఉన్నాయి.. చెన్వార్‌కి చెందిన రాంచందర్ తన బొలేరోలో ఇతర రైతుల వరిధాన్యాన్ని మహబూబ్ నగర్‌కు మంగళవారం తీసుకెళ్తుండగా భూనీడ్, కొత్తపల్లి మధ్యలో ఉన్న వంతెన వద్ద వాహనం అదుపుతప్పి వాగులోకి పడిపోయి బోల్తా పడింది. ఈ క్రమంలో రాంచందర్ కిందకు దూకడంతో స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. కాగా ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన వద్ద రోడ్డు సరిగా లేకపోవడం, గుంతలు పడడమే ప్రమాదానికి కారణమని బాధితుడు ఆరోపించారు.

రుద్రసముద్రం సమీపంలో ట్రాక్టర్..

మక్తల్: వరిధాన్యంతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనిది.. వివరాలు ఇలా ఉన్నాయి. గడ్డంపల్లికి చెందిన రంగశివకు ట్రాక్టర్ వరిధాన్యంతో వెళ్తూ రుద్రసముద్రం సమీపంలో మంగళవారం బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

కొత్తపల్లిలో మే డే వేడుకలు



మద్దూరు: కొత్తపల్లి మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మేడే ఉత్సవాలను నిర్వహించారు. కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ జెండావిష్కరణ చేశారు. ప్రజా సంఘాల నాయకులు వెంకటేష్, శివకుమార్ పాల్గొన్నారు.

క్రీడా శిబిరాలను వినియోగించుకోవాలి

మక్తల్: చిట్యాలలో జిల్లా అథ్లెటిక్స్ అండ్ వాలీబాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వేసవి క్రీడా శిబిరాన్ని జిల్లా కార్యదర్శి రమణ, కోచ్ జగదీష్ , సర్పంచ్ జానకీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మక్తల్‌లో మంగళవారం క్రీడా శిబిరాన్ని జిల్లా అధికారి కృష్ణామాచారీ ప్రారంభించారు. గోపాలం, శ్రీనివాసులు, అంజయ్య, శ్రీనివాసులు, లక్ష్మారెడ్డి, సాయినాత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



ఊట్కూర్: కార్మికశాఖ ఆధ్వర్యంలో ఊట్కూర్‌లో వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా 150 మంది కార్మికులకు వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. జిల్లా కార్మికశాఖ అధికారి రాజ్‌కుమార్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కేపీ విజయరాజు, కో–ఆర్డినేటర్ అబ్దుల్ నయిమ్ పాల్గొన్నారు.

హక్కుల సాధన కృషి

మక్తల్ : మానవ హక్కుల రక్షణ, సాధన కోసం కృషి చేస్తున్నామని హ్యూమన్ రైట్స్ యాంటి కరప్షన్ ఫోరం రాయిచూర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌సాదిక్ తెలిపారు. పట్టణంలో ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి శ్రీరామ్, ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణ యజమాని నిజాయతీ

నారాయణపేట రూరల్ : కొనుగోలు దారుడు మరిచిపోయిన రూ.1.20లక్షల విలువ చేసే బంగారు ఆభరణం తిరిగి అందించి ఓ వస్త్ర దుకాణ యజమాని నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకలోని గుర్మిట్కల్ తాలుకా దేవరపల్లి కి చెందిన మేలిగిరి బసప్ప కుమార్తె వివాహం కోసం పేట జిల్లా కేంద్రంలో బంగారం కొనుగోలుకు మంగళవారం వచ్చాడు. ఈ క్రమంలో సరాఫ్‌బజార్‌లోని ఓ దుకాణంలో రెండు తులాల ఆభరణం చేయించుకుని పాతబస్టాండ్‌లోని ఏఏ బ్రదర్స్ టెక్స్‌టైల్ బట్టల దుకాణానికి వచ్చాడు. అక్కడ బట్టలు తీసుకుని హడావిడిలో బంగారం ఉన్న బ్యాగును అక్కడే మర్చిపోయాడు. ఇది గమనించిన దుకాణ యజమాని షకీల్ వెంటనే కానిస్టేబుల్ రాజు ద్వారా పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. వివరాలు సేకరించి బాధితుడు బసప్పకు ఎస్ఐ సురేష్ చేతుల మీదుగా అందించారు. దీంతో పలువురు షకీల్‌ను అభినందించారు.


పరిసరాల పరిశుభ్రత అవసరం

కోయిల్‌కొండ: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని ఎంపీడీఓ జయరాములు అన్నారు. మంగళవారం మండలంలోని అనంతపూర్‌లో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా ఎంపీడీఓ జయరాములు, ఎంపీఓ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శుల బృందం గ్రామంలో శానిటేషన్ విధానాన్ని, సెగ్రిగేషన్ షెడ్డులో తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించారు. గ్రామ పనితీరుపై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

కల్లాల్లో మొలకెత్తిన ధాన్యం



మరికల్ మండలంలో వరిధాన్యంపై కప్పి ఉంచిన కవర్లు



పెద్దచింతకుంట శివారులో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

మరికల్: మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురిసిన అకాల వర్షానికి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన వరి పంట నేల వాలగా. కల్లాల్లో ఆరబెట్టిన వడ్లు తడిసిపోయాయి. గత వారం రోజుల నుంచి నిత్యం కురుస్తున్న వర్షాల కారణంగా కల్లాలో ధాన్యం తడిసి మొల్లకెత్తింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యం మిల్లులకు తీసుకెళ్తే తేమ శాతం ఎక్కువగా ఉందని వాపస్ పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల నుంచి రాత్రి, పగలు ఇక్కడే ఉంటున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని తడిసిన ధాన్యంను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

అధ్వానంగా బైరంపల్లి రోడ్డు



మాగనూర్: మండలంలోని బైరంపల్లి రోడ్డు అధ్వానంగా మారడంతో గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నెరడగం గేట్ నుంచి 4 కిలో మీటర్ల మేర ఉన్న ఈ దారి మొత్తం మట్టిరోడ్డు కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనికితోడు అడుగడుగునా గుంతలమయంగా మారడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పాలకులు స్పందించడం లేదని ఇప్పటికై నా సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

లోకుర్తిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, తదితరులు

దామరగిద్ద: మండలంలోని లోకూర్తిలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ మహేశ్వరీ బసంత్‌రెడ్డి, ఎంపీటీసీ కొండప్ప, రైతు సమితి మండల కో ఆర్డినేటర్ ప్రారంభించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ స్వప్న, మాజీ సర్పంచ్ సుదర్శన్, రైతులు భీంరెడ్డి, బసంత్ రెడ్డి, రామకృష్ణ, మహిళ సమాఖ్య సభ్యులు ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు సిద్ధమైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం

మాగనూర్: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 3న పల్లకీ సేవా, 4న స్వామివారి జయంతి, 5న ప్రభోత్సవం, కల్యాణోత్సవం, 6న రథోత్సవం, పాల ఉట్లు, 7న గురుడ వాహన సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.

4 నుంచి ఆంజనేయస్వామి ఉత్సవాలు

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో ఈ నెల 4 నుంచి 7 వరకు ఆంజనేయస్వామి జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా 5న ఎల్లమ్మ ఉత్సవాలు ఉంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ఊట్కూర్: మండలంలోని ఎల్‌బీ నగర్ వీధిలో వెలసిన పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 5న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు కృష్ణయ్య గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాధితుడికి ఫోన్ అప్పగించిన పోలీసులు



మద్దూర్‌లో సెల్‌ఫోన్ అందుకుంటున్న మహేష్

మద్దూరు: సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి మంగళవారం అందజేశారు. వివరాల్లోకి వెళితే దామరగిద్ద మండలానికి చెందిన మహేష్ 20న మద్దూరు సంతకు వచ్చి ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో నూతన టెక్నాలజీ ఫోన్ ఆచూకీ గుర్తించారు. ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రెండో ఎస్ఐ శ్యాంసుందర్, కానిస్టేబుల్ భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

నర్వ: సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా పట్టుకున్న ఘటన నర్వలో చోటుచేసుకుంది. ఎస్ఐ విక్రమ్ వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన గల్ల వెంకటయ్య నెల 20న మొబైల్‌ఫోన్‌ను పోగుట్టుకున్నాడు. దీనిపై ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు గుర్తించి మంగళవారం అందజేశారు.

నేత్ర పర్వంగా బోనాలు



నారాయణ పేటలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



అప్పిరెడ్డిపల్లిలో..



నర్వ మండలంలో

నారాయణపేట రూరల్ : మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో గజ్జలమ్మ, మైసమ్మ బోనాల జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఏటా నిర్వహించే ఆచారంలో భాగంగా దామరగిద్ద మండలం వత్తుగుండ్ల నుంచి బోనాలు, కోయిలకొండ మండలం శేరివెంకటాపూర్ నుంచి సవారి వచ్చి పూజలు చేశారు. సర్పంచ్ ప్రభావతి, ఎంపీటీసీ జయలక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని హరిజనవాడలో మశమ్మ జాతర నేత్రపర్వంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు సమర్పించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, ఉల్లిగడ్డ, బియ్యంతో ఒడి నింపారు.

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్, కొత్తపల్లి గ్రామాల మధ్య వెలిసిన గజ్జలమ్మ జాతర మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పెద్దకడ్మూర్, కొత్తపల్లి, ఎల్లంపల్లి గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండల కేంద్రం శివారులో వెలసిన గజ్జలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అర్చన పూజలు చేశారు. సాయంత్రం బోనాలు సమర్పించారు. అదేవిధంగా బుధవారం పొలిచల్లడం, రెట్టపట్ల కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు, సర్పంచ్ ఆశమ్మ తెలిపారు.

రెగ్యులరైజ్ చేసే వరకు పోరాటం



మక్తల్‌లో నిరసన చేపట్టిన కార్యదర్శులు



ధన్వాడలో..

సాక్షి నెట్ వర్క్ :జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల సమ్మె కొనసాగుతోంది. ఆయా మండల కేంద్రాల్లో సాగుతున్న సమ్మెకు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, సర్పంచులు మద్దతు తెలుపుతున్నారు.

- మక్తల్‌లో అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మధు,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.
- ఊట్కూర్‌లో సంఘం నాయకులు సునీత, మంజుల, సుమలత, అమర్‌నాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.
- మాగనూర్‌లో బీజేపీ నాయకులు సమ్మెకు మద్దతు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కొండయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, నాయకులు కనకరాజ్, కొత్తపల్లి సర్పంచ్ తిమ్మప్ప, సోమ్‌శేఖర్‌గౌడ్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.
- కృష్ణాలో నర్సింహారెడ్డి, రాములు, రూప, నర్సిములు, బాస్కర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.
- దామరగిద్దలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యయాదవ్, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి, గోపాల్‌రావ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.
- ధన్వాడలో ఎంపీపీ పద్మీబాయి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, శక్తికేంద్రం ఇన్‌చార్జ్ రాంచంద్రయ్య, ఎంపీటీసీ ఉమేష్, మండల అధ్యక్షుడు మాకం సురేందర్, పాండునాయక్, కార్యదర్శులు పాల్గొన్నారు.
- మద్దూరులో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నర్మద, స్వేరోస్ సంస్థ సభ్యులు మద్దతు పలికారు.